
నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

# బైక్‌ల దొంగ అరెస్ట్

- నాలుగు వాహనాల స్వాధీనం
- పోలీసులను అభినందించిన సీపీ

మట్టెవాడ, నవంబర్ 1: ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తూ తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మట్టెవాడ సీఐ టీ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నగరంలో ఎస్సై లచ్చయ్య ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల తనిఖీలను చేపట్టాం. ఈ క్రమంలో వంగరి బాలరాజు హీరోహోండా బైక్‌పై వెళ్తుండగా అనుమానం వచ్చి ఆపాం. బైకుకు సంబంధించిన పత్రాలను అడుగగా బాలరాజు సమాధానం చెప్పకపోవడంతో ఆధీనంలోకి తీసుకొని విచారణ చేయగా ద్విచక్ర వాహనాలను దొంగిలించేవాడని తేలింది. నగరంలోని పలు ప్రాంతాల్లో దొంగిలించిన నాలుగు మోటర్ సైకిళ్ల వివరాలును నిందితుడు తెలపడంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అరెస్టు చేసిన నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు. కాగా బైక్ దొంగను అరెస్ట్ చేయడమే కాకుండా నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడంపై మట్టెవాడ పోలీసులను వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝూ అభినందించారు.

# సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

ఏటూరునాగారం, నవంబర్ 1 : మండల కేంద్రంలోని కొండగొర్ల ముత్తయ్యకు సీఎంఆర్‌ఎఫ్ కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 27వేల చెక్కును ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, ఖాజాపాషా, కిరణ్ కుమార్, రాంనర్సయ్య, భోజారావు, చంద్రబాబు, రాంబాబు, మెరుగు వెంకటేశ్వర్లు, పాలకుర్తి విజయ్, బట్టు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

దంతాలపల్లి, డిసెంబర్ 1 : మండల కేంద్రంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. దంతాలపల్లి గ్రామానికి చెందిన సాధు లచ్చమ్మ ఇంట్లో కరెంట్ బోర్డులో ఆదివారం షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు ఇంట్లోకి వ్యాపించి బీరువా, మంచం, విలువైన కాగితాలు, ఇంట్లో సామగ్రి, దుస్తులకు అంటుకొని కాలిపోయాయి. లచ్చమ్మ కేకలు వేయడంతో స్థానికులు సకాలంలో మంటలు ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది.

***కోమటిపల్లిలో గడ్డి దగ్ధం..***

ఇనుగుర్తి : షార్ట్ సర్క్యూట్‌తో గడ్డి దగ్ధమైన ఘటన మండలంలోని కోమటిపల్లిలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పాతతండాకు చెందిన ఇస్లావత్ లచ్చిరాం తన పొలంలోని గడ్డిని పశుగ్రాసానికి ట్రాక్టర్‌లో తీసుకెళ్లుతున్న క్రమంలో కోమటిపల్లిలో ఎల్‌టీ కరెంట్ వైరుకు తగిలి షాట్‌సర్క్యూట్ జరిగింది. ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ వెంటనే కల్వాల గ్రామం వైపు ట్రాక్టర్‌ను తీసుకెళ్లి లిఫ్టు సాయంతో గడ్డిని కింద పడేశాడు. దీంతో ఎలాంటి ప్రాణనష్ట జరుగలేదు. విద్యుత్ అధికారులు స్పందించి కోమటిపల్లిలో కరెంటు వైర్లను సరిచేయాలని గ్రామస్తులు కోరారు.


ఇనుగుర్తి: మంటల్లో కాలిపోతున్న గడ్డి

# వెక్కిరిస్తున్న ఏకశిల క్రీడామైదానం

- బీఆర్‌ఎస్ హయాంలో రూ.20 లక్షలతో అభివృద్ధి
- ఏడాది కాలంగా గాలికొదిలేసిన నిర్వహణ
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం

ఖిలావరంగల్, డిసెంబర్1: వాలీబాల్, ఖోఖో, కబడ్డీ కోచ్‌ల ద్వారా శిక్షణ తీసుకొని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేసిన ఖిలావరంగల్‌లోని ఏకశిల క్రీడామైదానం నేడు అధ్వానంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాని నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. గంజాయి, మద్యంప్రియులకు వేదికగా మారింది. సుమారు 35 ఏళ్ల క్రితం స్థానిక పెద్దలు, క్రీడాకారులు ఏకశిలా క్రీడామైదాన్ని ఏర్పాటు చేశారు. ఖోఖో, కబాడ్డీ, వాలీబాల్‌లో కోచ్‌ల ద్వారా శిక్షణనిప్పించి జాతీయ, అంతర్జాతీ యస్థాయికి పింపించారు. అంతర్జాతీయ స్థాయిలో ఖోఖోలో భారత్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన సారంగపాణి ఇక్కడి శిక్షణ తీసుకున్నవాడే. నాటి క్రీడాకారులు సుమారు 200 మంది స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం పొంది వివిధ హోదాల్లో స్థిరపడ్డారు. కాలక్రమేణా క్రీడా మైదానాన్ని ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏకశిల క్రీడామైదానం రూపురేఖలు మార్చేశారు.

***బీఆర్‌ఎస్ హయాంలో రూ.20 లక్షలతో అభివృద్ధి***

ఏకశిల క్రీడామైదానంలో మౌలిక వసతులు కల్పించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. 20 లక్షల నిధులు విడుదల చేసింది. బాలబాలికలకు వేర్వేరుగా భవనం నిర్మించారు. డ్రెస్సింగ్ రూములు, అటాచ్డ్ మల, మూత్ర శాలలతోపాటు భారీ వేదికను నిర్మించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ కోసం కోర్టులు ఏర్పాటు చేశారు. మైదానంలో ఫ్లడ్ లైట్లను అమర్చారు.

***అధ్వానంగా మారిన క్రీడామైదానం***

ఏడాది కాలంగా ఏకశిల క్రీడామైదానాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మా రింది. ప్రధాన గేటును గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో స్థానికులు మల మూత్ర శాలల కింద వాడుతున్నారు. అలాగే క్రీడాకారుల కోసం నిర్మించిన గదుల తలుపులు, కిటికీలు పగులగొట్టి లోపల గంజాయి, సిగరెట్లు, మద్యం సేవిస్తున్నారు. తాగి పడేసిన సీసాలు, చెత్తాచెదారం పేరుకపోయింది. అలాగే బోరుబావికి ఉన్న పంపుసెట్, ఫర్నిచర్‌ను గుర్తు తెలియని వ్య క్తులు ఎత్తుకెళ్లారు. ఫ్లడ్ లైట్ స్తంభాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఒకప్పుడు ఆటల పోటీలు, కోచింగ్‌లతో కళకళలాడిన ఏకశిల క్రీడామైదానం నేడు గడ్డి పెరిగి మల, మూత్ర విసర్జన లతో కంపు కొడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి మైదాన్ని పరిరక్షించాలని క్రీడాకారులు కోరుతున్నారు.


అధ్వానంగా మారిన క్రీడామైదానం


డ్రెస్సింగ్ గదుల్లో తాగిపడేసిన గంజాయి, సిగరెట్ పీక ముక్కలు, పగుల గొట్టిన మద్యం సీసాలు

# బయ్యారం జవాన్‌కు ఐక్యరాజ్య సమితి అవార్డు

బయ్యారం డిసెంబర్ 1 : ఐక్యరాజ్య సమితి భద్రతా దళంలో విజయవంతంగా విధులు నిర్వర్తించిన బయ్యారంవాసి అవార్డు దక్కించుకున్నాడు. బయ్యారం మండలం ఉప్పలపాడుకు చెందిన అజ్మీరా హతీరాం నాయక్ 2016లో ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం పొందాడు. అయితే, దేశ రక్షణలో ప్రతిభ చూపడంతో ఇండియన్ ఆర్మీ తరఫున ఐక్యరాజ్యసమితి శాంతి భద్రతా దళంలో సభ్యుడిగా చోటు దక్కించుకుని, ఫిబ్రవరిలో విధుల్లో చేరాడు. ఇజ్రాయిల్ , సిరియా, లెబనాన్ వంటి దేశాల్లో 10 నెలల పాటు పనిచేసి నవంబర్ 22న స్వదేశానికి చేరుకున్నాడు. అంతేకా కుండా విధుల్లో ప్రతిభ చూపడంతో ఐక్యరాజ్య సమితి చీఫ్ నిర్మల్ దఫా చేతుల మీదుగా ప్ర శంసాపత్రంతో పాటు అవార్డు అందుకున్నారు. ఇండియన్ ఆర్మీ నుంచి 126 మంది ఐక్యరాజ్యసమితి భద్రతా దళానికి వెళ్లగా తెలంగాణ నుంచి ఇద్దరికి మాత్రమే చోటు దక్కింది. అందులో హతీరాం ఒకరు. సమర్థవంతంగా విధులు పూర్తి చేసుకొని శనివారం స్వగ్రామానికి హతీరాం చేరుకోగా మాజీ సైనికులు, క్రీడాకారులు, కుటుంబ సభ్యులు సత్యనారాయణ, వీరూనాయక్, రాంబాబు, గణేశ్, నగేశ్, శ్రీకాంత్, కృష్ణనాయక్ తదితరులు ఘనస్వాగతం పలికి సత్కరించారు.


జవాన్ హతీరాంనాయక్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

# ధాన్యం తరలింపునకు అధికారుల తిప్పలు

- లారీలు రాకపోవడంతో రంగంలోకి దిగిన ఆర్టీఏ, రెవెన్యూ, పీఏసీఎస్ అధికారులు
- మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని ఖమ్మం-వరంగల్ ప్రధాన రహదారిపై లారీలను ఆపి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలింపు


మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పాలకేంద్రం వద్ద వరంగల్-ఖమ్మం రహదారిపై లారీలను ఆపుతున్న ఆర్టీఏ, రెవెన్యూ అధికారులు

తొర్రూరు, డిసెంబర్ 1 : కొనుగోలు కేంద్రాల్లో కాంటాలైన ధాన్యం తరలింపునకు అధికారులు తిప్పలు పడుతున్నారు. లారీలు అందుబాటులో లేకపోవడంతో రహదారిపై వచ్చిన లారీను ఆపి కొనుగోలు కేంద్రాలకు మళ్లిస్తున్నారు. ఈ ఘటన ఆదివారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని పాలకేంద్రం సెంటర్‌లో ఖమ్మం-వరంగల్ ప్రధాన రహదారిపై ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కొనుగోలు కేంద్రాల్లో కాంటాలైన ధాన్యం తరలింపునకు వాహనాలు రాకపోవడంతో జిల్లా ఆర్టీఏ, రెవెన్యూ, పీఏసీఎస్, సివిల్ సప్లయ్ అధికారులు రంగంలోకి దిగారు. ఖమ్మం-వరంగల్ ప్రధాన రహదారిపై వచ్చే లారీలను మరి ఆపి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వైపు మళ్లించారు. ధాన్యం తరలింపులో వాహనాల గుత్తేదారు వాహనాలను కేంద్రాలకు పంపించకపోవడంతో కొన్ని రోజులుగా కొనుగోలు కేంద్రాల్లో కాంటాలైన ధాన్యం నిల్వ ఉండడం అధికారులకు తలవొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లా ఆర్టీఏ, రెవెన్యూ, పీఏసీఎస్, సివిల్ సప్లయ్ అధికారులు రోడ్డుపై మకాం వేసి రహదారిపై వచ్చే లారీలను ఆపి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు.

## భార్యను చంపి.. బావిలో ఉరేసి..


అనూష(ఫైల్)

కేసముద్రం, నవంబర్1 : వివాహేతర సంబంధం కలిగి ఉందనే అనుమానంతో భార్య గొంతు నులిపి చంపిన ఘటన మండల కేంద్రంలోని ఉప్పరపల్లి రోడ్డులో ఆదివారం జరిగింది. సీఐ సర్వయ్య, ఎస్సై మురళీధర్‌రాజ్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బత్తుల వీరన్న చిరువ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా డు. అతడికి బోడమంచ్యతండాకు చెందిన అనూష(31)తో 2011లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు రాజేశ్ ఉన్నాడు. రాజేశ్ నాలుగు రోజుల క్రితం అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. అయితే, కొన్నేళ్లుగా వీరన్నకు భార్య అనూషపై అనుమానం ఉంది. ఈ క్రమంలో పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. శనివారం కూడా భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆవేశానికి లోనైన వీరన్న భార్య అనూష గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం ఆమె మెడకు చున్నీ బిగించి ఇంట్లో ఉన్న బావి దూలానికి వేలాడదీశాడు. ఆదివారం తెల్లవారుజామున తన భార్య ఉరి వేసుకుందని ఇరుగు పొరుగు వారికి సమాచారం అందించి పరారయ్యాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు పంపినట్లు పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు విచారణ అనంతరం తెలుపుతామని చెప్పారు.

## విద్యుత్ స్తంభం విరిగిపడి యువకుడి మృతి


గణేశ్(ఫైల్)

వర్ధన్నపేట, డిసెంబర్ 1: విద్యుత్ స్తంభం విరిగిపడడంతో పట్టణ పరిధిలోని డీసీ తండాకు చెందిన యువకుడు ఆదివారం మృతి చెందాడు. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూక్యా గణేశ్(26) ప్రైవేటు సంస్థలో విద్యుత్ స్తంభాలు పాతే పని చేస్తున్నాడు. తొర్రూరు సమీపంలో రెండ్రోజుల క్రితం పనులు చేస్తుండగా స్తంభం విరిగిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే వరంగల్‌లోని దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గణేశ్ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

***నర్సంపేటలో వృద్ధుడు..***

నర్సంపేట: నర్సంపేటలోని పోలీసు క్వార్టర్స్‌లో ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం జరిగింది. నర్సంపేటలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఏనుగు రాజు తన తండ్రి, భార్యా పిల్లలతో కలిసి పోలీసు క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. అతడి తండ్రి మొగిలి(65) ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్రురూం వెనక ఉరి వేసుకుని మృతి చెందాడు. మొగిలి భార్య కొంతకాలం కిందట క్యాన్సర్‌తో బాధపడుతూ మృతి చెందింది. భార్య మరణాన్ని తట్టుకోలేని మొగిలి మనస్తాపంతో ఉంటున్నారు. రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపించారు.

# ఏ బీమా ఉత్తమం?

## టర్మ్ ప్లాన్-వ్యక్తిగత ప్రమాద బీమాల్లో తేడాలేమిటి?

*ఎవరికి ఎప్పుడు.. ఎక్కడ.. ఏమవుతుందో తెలుసుకోవడం చాలా కష్టం. అందుకే ప్రతీ ఒక్కరికీ బీమాతోనే ధీమా. ఆపత్కాలంలో ముఖ్యంగా మనం లేని రోజున మన కుటుంబానికి కొండంత అండగా ఉండేది బీమానే మరి. అలాంటి బీమాల్లో అనేక రకాలున్నాయి. జీవిత బీమా, ఆరోగ్య బీమా, టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్, పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్‌లు ఇలా ఎన్నో ఉన్నాయి. ప్రీమియంలు, కాలవ్యవధులు, వాటి ప్రయోజనాలనుబట్టి ఆయా వర్గాల్లో ఇవి ఆదరణను సొంతం చేసుకుంటున్నాయి. అయితే ఇటీవలి కాలంలో టర్మ్ ప్లాన్స్‌కు, వ్యక్తిగత ప్రమాద బీమాలకు చాలా డిమాండ్ కనిపిస్తున్నది. మరి వీటిలో ఏది ఉత్తమం? అసలు ఈ రెండింటిలో ఉన్న తేడాలేమిటి?*




**టర్మ్** ఇన్సూరెన్స్ అనేది జీవిత బీమాలో ఓ రకం. నిర్ణీత కాలవ్యవధికిగాను పాలసీదారునికి లైఫ్ కవరేజీనిస్తుంది. ఒకవేళ పాలసీ కాలంలో పాలసీదారుడు చనిపోతే బీమా సంస్థ నామినీలకు బీమా సొమ్మును అందిస్తుంది. కుటుంబ పెద్ద లేని లోటును, ప్రధానంగా కుటుంబ సభ్యుల భవిష్యత్తు ఆర్థిక అవసరాలను తీర్చడంలో టర్మ్ ప్లాన్లు చాలాచాలా పాపులారిటీనే సంపాదించాయి. నెల, 3 నెలలు, 6 నెలలు, ఏడాది చొప్పున ఈ బీమా కోసం పాలసీదారులు ప్రీమియం మొత్తాలను చెల్లించవచ్చు. కొన్ని ప్లాన్లలో ఒకేసారి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. మరికొన్ని ప్లాన్లకు పాలసీదారుడు తన వీలునుబట్టి కాలవ్యవధి మొత్తానికి చెల్లించే ప్రీమియంలను ముందే చెల్లించే వెసులుబాటు కూడా ఉంటుంది. ఉదాహరణకు మీ పాలసీ కాలవ్యవధి 20 లేదా 30 ఏండ్లు ఉందనుకుంటే దాని ప్రీమియంలను ఆ 20-30 ఏండ్లు నిర్ణీత వాయిదాల్లో చెల్లించుకోవచ్చు. లేదంటే ప్రీమియం మొత్తాన్ని 5, 10, 15 ఏండ్లకు కుదించి కూడా వాయిదాల పద్ధతుల్లో చెల్లించవచ్చు. ఇక పాలసీ తీసుకునేటప్పుడున్న వయసు, విద్య, ఆరోగ్య పరిస్థితులు, ఆదాయం, బీమా ప్రయోజనం, కాలవ్యవధిల ప్రకారం ప్రీమియంలను, బీమా మొత్తాలను నిర్ణయిస్తారు. అయితే ఈ టర్మ్ ఇన్సూరెన్స్‌ల్లో మనీ బ్యాక్, మనీ బ్యాక్ లేని పాలసీలు కూడా ఉంటాయి. పాలసీదారుడు పాలసీ కాలవ్యవధిలో చనిపోకుంటే చెల్లించిన ఆ ప్రీమియంలు తిరిగి రావు. చనిపోతే మాత్రం హామీ మేరకు పాలసీ సొమ్ము మొత్తం వచ్చేస్తుంది. ఇక్కడితో ఆ పాలసీ ముగిసిపోతుంది. ఒకవేళ చనిపోకున్నా కట్టిన ప్రీమియంలు తిరిగి రావాలంటే మాత్రం.. సాధారణ ప్రీమియం కంటే ఎక్కువ మొత్తాలను చెల్లించాల్సి ఉంటుంది. ఇక కనిష్ఠంగా 4 ఏండ్ల నుంచి గరిష్ఠంగా 60 ఏండ్లదాకా టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ కాలవ్యవధిని నిర్ణయించుకోవచ్చు. మీ వయసుపై ఇది ఆధారపడి ఉంటుంది.

### వ్యక్తిగత ప్రమాద బీమా

వ్యక్తిగత ప్రమాద బీమా అనేది ప్రమాదం బారినపడ్డ పాలసీదారులకే వర్తిస్తుంది. ప్రమాదం కారణంగా చనిపోయినా, లేదంటే శాశ్వత అంగవైకల్యానికి గురైనా, తీవ్ర గాయాలపాలైనా పాలసీని క్లెయిం చేసుకోవచ్చు. ఎలాంటి ప్రమాదం సంభవించకపోతే పాలసీ వర్తించదు. ప్రమాదంతో దవాఖానపాలైనా వైద్య ఖర్చుల కోసం బీమా సొమ్మును పొందే వెసులుబాటు ఉంటుంది. కానీ పాలసీ నిబంధనలు, షరతులకు లోబడి ఈ సౌకర్యాలను అందుకోగలం. అయితే ప్రమాదం సహజంగా కాకుండా ఉద్దేశపూర్వకంగా జరిగినట్టు ఉంటే మాత్రం బీమా సొమ్ము రాదు. ఉదాహరణకు మీరు కారులో వెళ్తున్నప్పుడు ప్రమాదం సంభవిస్తే.. అప్పుడు మీరు మద్యం, ఇతరత్రా మత్తు పదర్థాలను తీసుకున్నా, రాంగ్ రూట్‌లో వెళ్లినా మీ క్లెయిం రిస్క్‌లో పడుతుంది. ఇక వ్యక్తి వయసు, ఆరోగ్యం, ఇతరత్రా పరిస్థితులేవీ కూడా ఇందులో ప్రాధాన్యం కావు. పాలసీదారులు చెల్లించే ప్రీమియంలనుబట్టి బీమా ప్రయోజనాలుంటాయి.

### చివరగా..

వ్యక్తిగత ప్రమాద బీమా, టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ రెండూ ముఖ్యమే. దేని ప్రాధాన్యత దానికి ఉంటుంది. ప్రమాదంలో గాయపడి, వైద్య చికిత్సను తీసుకుంటున్నప్పుడు టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ వర్తించదు. అప్పుడు మనల్ని రక్షించేది పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్సే. కాబట్టి రెండింటినీ తీసుకోవడం ఉత్తమం. ఇక బీమా ప్రీమియంలకు ఆదాయ పన్ను (ఐటీ) చట్టం 1961లోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులుంటాయి. అలాగే బీమాను ఎప్పుడూ భారంగా భావించవద్దు. మన కుటుంబ సభ్యులకు ఇదే కొండంత ధైర్యాన్నివ్వగలదు. ఆర్థిక భద్రతనూ కల్పిస్తుంది.

# రుణ భారం తగ్గేదెలా?



**రిటైల్** ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభించింది. దీంతో రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లు ఇప్పట్లో తగ్గే అవకాశాలు కనిపించడం లేదు. ఫలితంగా బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నవారికి ఉపశమనం కలగడం కలగానే మారిపోతున్నది. ముఖ్యంగా గృహ రుణగ్రహీతలపై భారం తడిసి మోపెడవుతున్నదంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అయితే బ్యాంకింగ్ రంగ నిపుణులు ఈ రుణ భారం తగ్గించుకోవడానికి కొన్ని మార్గాలను సూచిస్తున్నారు.

### ఇదీ సంగతి..

గృహ రుణం వంటి దీర్ఘకాల లోన్లను తీసుకున్నవారికి అధిక వడ్డీరేట్లు శరాఘాతమే అవుతాయి. అయితే రుణ కాలపరిమితిని వీలైనంత తగ్గించుకుంటే వడ్డీ భారం కూడా తక్కువగా పడుతుందని ఎక్స్‌పర్ట్స్ సూచిస్తున్నారు. చక్రవడ్డీ నుంచి ఉపశమనం లభిస్తుండటమే ఇందుకు కారణం. ఉదాహరణకు పదేండ్ల కాలవ్యవధితో రూ.50 లక్షల రుణాన్ని 9 శాతం వార్షిక వడ్డీరేటుకు తీసుకున్నట్లైతే రూ.26 లక్షలు అదనంగా చెల్లించాల్సి వస్తున్నది. కానీ ఇదే రుణాన్ని 15 ఏండ్ల కాలవ్యవధితో తీసుకుంటే వడ్డీ భారం రూ.41 లక్షలకు, 20 ఏండ్లకైతే రూ.58 లక్షలకు పెరుగుతున్నది. కాబట్టి వీలున్నప్పుడల్లా కొద్దికొద్దిగా అసలు రుణాన్ని తీర్చుతూపోతే టెన్యూర్‌ను తగ్గించుకోవచ్చు. ఈఎంఐలను మాత్రం తగ్గించుకోకూడదని గుర్తుంచుకోవాలి. ఈఎంఐ తగ్గితే భారం అంతే ఉంటుంది. అలాగే పెరిగే మీ ఆదాయాన్నిబట్టి ఏటా మీ ఈఎంఐలను పెంచుకుంటూపోయినా రుణ భారం తగ్గుతుందని సూచిస్తున్నారు. ఈఎంఐని ఏటా 5 శాతం పెంచుకుంటూపోయినా 20 ఏండ్ల కాలవ్యవధితో ఉన్న గృహ రుణం 18 ఏండ్లకు తగ్గించుకోవచ్చని చెప్తున్నారు. ఈఎంఐ 10 శాతం పెంచుకుంటే 9 శాతం వార్షిక వడ్డీరేటుతో ఉన్న రూ.50 లక్షల రుణం కాలవ్యవధి 10 ఏండ్లకు తగ్గుతుంది.

# ఊగిసలాటలో మార్కెట్లు!

**దేశీయ** స్టాక్ మార్కెట్లలో లాభనష్టాల దోబూచులాటలు కొనసాగుతున్నాయి. గత కొద్ది రోజులుగా పడుతూలేస్తూ పయనిస్తున్న సూచీలు.. గడిచిన వారం కూడా అదేదారిలో నడిచాయి. మదుపరులు అమ్మకాలు, కొనుగోళ్ల మధ్య ఊగిసలాడారు. అయినప్పటికీ ఆఖర్లో పెట్టుబడులకే పెద్దపీట వేశారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 685.68 పాయింట్లు లేదా 0.86 శాతం బలపడి 79,802.79 వద్ద ఆగింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ 223.85 పాయింట్లు లేదా 0.93 శాతం పుంజుకొని 24,131.10 దగ్గర స్థిరపడింది. ఈ వారం విషయానికొస్తే.. రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలు, గౌతమ్ అదానీ లంచం కేసు, విదేశీ మదుపరుల పెట్టుబడులు ప్రధానంగా ట్రేడింగ్‌ను ప్రభావితం చేయవచ్చు. అయితే ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో దేశ జీడీపీ గణాంకాలు నెమ్మదించడంపై మార్కెట్ రియాక్షన్ కీలకం కానున్నది. అంతేగాక నవంబర్ నెల వాహన విక్రయాలు ఆటో షేర్లపై ప్రభావం చూపవచ్చు. అలాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు కూడా ముఖ్యమే. అమెరికాలో పెరిగిన ద్రవ్యోల్బణం, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లపై ఊహాగానాలనూ తోసిపారేయలేమన్న అంచనాలున్నాయి. దీంతో ఒడిదొడుకులు ఈ వారం కూడా తప్పవనే అనిపిస్తున్నది. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,500-24,700 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.




### గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

# రాబడి

## క్షణాల్లో బ్యాలెన్స్ ఇలా..

### పీఎఫ్ ఖాతా చెకింగ్‌కున్న మార్గాలివే

**ఎంప్లాయీస్** ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో)లో మదుపు ఓ చక్కని అవకాశం. ఉద్యోగులకు మాత్రమే ఉండే సౌలభ్యం. అటు ఉద్యోగి నుంచి, ఇటు పని చేసే సంస్థ నుంచి కూడా సమాన మొత్తాల్లో ఈపీఎఫ్‌లో జమవుతాయి. పైగా ఇందులో మన నగదు నిల్వలకు అత్యధిక వడ్డీరేట్లు వర్తిస్తాయి. ప్రస్తుతం అది 8.25 శాతంగా ఉండటం గమనార్హం. ఈ వడ్డీ చెల్లింపులు ఏడాదికోసారి ఉంటాయి. ఉద్యోగి ఈపీఎఫ్ ఖాతాలోనే నేరుగా ఈ వడ్డీ సొమ్ము డిపాజిట్ అవుతుంది. అప్పుడప్పుడు ఖాతాలోని బ్యాలెన్స్‌ను చెక్ చేసుకుంటుంటే ఇది తెలుస్తుంది. అయితే మీ ఖాతాలోని బ్యాలెన్స్‌ను క్షణాల్లో తెలుసుకొనేందుకు కొన్ని మార్గాలున్నాయి. వాటిని పరిశీలిస్తే..

ఉమాంగ్ యాప్

- స్మార్ట్‌ఫోన్లలో ఉద్యోగులు ఉమాంగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలి.
- యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లను క్రియేట్ చేసుకొని, లాగిన్ అవ్వాలి.
- ఆ తర్వాత ‘వ్యూ పాస్‌బుక్’ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- ఆపై మీ మొబైల్ స్క్రీన్‌పై పీఎఫ్ ఖాతా బ్యాలెన్స్‌ను చూసుకోవచ్చు.
- ఇందులో డిపాజిట్ అయిన మొత్తాలు, తదితర వివరాలూ ఉంటాయి.

ఈపీఎఫ్‌వో మెంబర్ పోర్టల్

- తొలుత ఈపీఎఫ్‌వో అధికారిక వెబ్‌సైట్ https://www.epfindia.gov.in కు వెళ్లాలి.
- ఆ తర్వాత సర్వీసెస్‌పై క్లిక్ చేయాలి.
- అక్కడ ఫర్ ఎంప్లాయీస్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- అందులో సర్వీసెస్‌లో కనిపించే మెంబర్ పాస్‌బుక్‌ను ఎంచుకోవాలి.
- ఆ తర్వాత తెరుచుకునే పేజీలో మీ యూఏఎన్ నెంబర్, పాస్‌వర్డ్‌లను ఎంటర్ చేసి, క్యాప్చా కొట్టాలి.
- మీ రిజిస్టర్ మొబైల్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. స్క్రీన్‌పై కనిపిస్తున్న దగ్గర ఓటీపీ ఎంటర్ చేయాలి.
- వెంటనే మీ ఖాతాలోని బ్యాలెన్స్ వివరాలు కనిపిస్తాయి. మీ సంస్థ ద్వారా ఎంత?, మీ ద్వారా ఎంత? వచ్చింది కూడా ఉంటుంది.
- ఉద్యోగిగా ఈపీఎఫ్‌వోలో మీ అనుభవం కూడా తెలుసుకోవచ్చు. అన్ని వివరాలు తెలుసుకున్నాక లాగౌట్ అవ్వడం మరిచిపోవద్దు.

### మిస్డ్ కాల్/ఎస్ఎంఎస్

మీ యూఏఎన్ రిజిస్టర్డ్ మొబైల్ ఫోన్ నుంచి 9966044425కి మిస్డ్ కాల్ ఇచ్చినా మీ పీఎఫ్ ఖాతాలోని బ్యాలెన్స్ వివరాలు ఎస్ఎంఎస్ రూపంలో మీకు వస్తాయి. లేదా మీ యూఏఎన్ నమోదిత మొబైల్ ఫోన్ నుంచే 7738299899కు “EPFOHO UAN ENG” అని టైప్ చేసి ఎస్ఎంఎస్ చేసినా వివరాలు లభిస్తాయి. ప్రాంతీయ భాషల్లోనూ సమాచారం తెలుసుకోవచ్చు. అందుకు పైన పేర్కొన్న దానిలో ENGకి బదులు TEL అని టైప్ చేస్తే తెలుగులో, HIN అని టైప్ చేస్తే హిందీలో సమాచారం అందుతుంది. ఇలా తమిళం, కన్నడ, మలయాళం, పంజాబీ, గుజరాతీ మరికొన్ని భాషలవారూ తమ భాష ఆంగ్ల పేరులోని మొదటి మూడు అక్షరాలను ఆంగ్ల క్యాపిటల్ అక్షరాల్లో టైప్ చేసి వివరాలను పొందవచ్చు. కాగా, EPFOHO UAN అని టైప్ చేసి పైన పేర్కొన్న మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ చేసినా ఆంగ్లంలో వివరాలు వస్తాయి. ఆంగ్లం అనేది డీఫాల్ట్‌గా ఉంటుంది. మీ మాతృ భాషలో సమాచారం కావాలంటేనే చివర్లో దాని ఆంగ్ల క్యాపిటల్ అక్షరాలను పేర్కొనాలి.

